విధి నిర్వహణలో గుర్తింపు ముఖ్యం



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి విజయకుమారి

మల్కాజిగిరి: ఏ వృత్తిలోనైనా విధి నిర్వహణలో గుర్తింపు రావడం ముఖ్యమని జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. మల్కాజిగిరి మండల విద్యాధికారి అంబటి సురేష్ ఉద్యోగవిరమణ కార్యక్రమం ప్రశాంత్‌నగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ.. ఏ వృత్తిలో రాణించాలన్నా.. మొదట విద్య నేర్చుకోవాల్సిందేనని, అందులో ఉపాధ్యాయులు కీలకమన్నారు. ప్రస్తుతం నూతన విధానాలు వస్తున్నాయని, పోటీ ప్రపంచంలో విద్యార్థులను తీర్చిదిద్దాలంటే ఉపాధ్యాయులు వాటిని నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నామన్నారు. ఉత్తీర్ణతతో పాటు వారు క్రమశిక్షణ విధానం నేర్చుకోవడం కూడా ముఖ్యమన్నారు. విశ్రాంత జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఈవో రాంభట్, డీవీఈవో వీవీఎస్ ప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్.శ్రీనివాస్, ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు



మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయంలో పూజల్లో బీజేపీ నేతలు

గౌతంనగర్: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు గౌతంనగర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేతలు మాశెట్టి అనీల్ గుప్తా, ఈసం రాకేష్‌ల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మల్లికార్జుననగర్ మల్లన్న దేవాలయంలో మోదీ పేరుమీద ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు నిర్వహించారు. నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్, ధన్‌రాజ్, గణేష్, ప్రకాష్, భరత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల మధ్య గొడవ..

ఆత్మహత్య చేసుకున్న భర్త



సురేష్ (ఫైల్)

మేడిపల్లి : భార్యాభర్తల మధ్య గొడవతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్‌కు చెందిన మంగళి సురేష్ (24)భార్య అఖిల (20). వీరికి 3 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. సురేష్ బోడుప్పల్ మల్లికార్జుననగర్ కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. కాగా అతడు ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓ సెలూన్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. భార్య అఖిల రియల్‌ఎస్టేట్ కంపెనీలో టెలికాలర్‌గా పనిచేస్తోంది. వీరిది ప్రేమ వివాహం కాగా.. 3 నెలల నుంచి వీరిద్దరి మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం భార్య డ్యూటీకి వెళ్లడంతో భర్త ఇంటివద్దే ఉన్నాడు. గొడవల కారణంగా మనస్తాపానికి గురైన అతడు ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ బాక్సులు ఎత్తుకెళ్తున్న నిందితుల అరెస్ట్

అల్వాల్: సెంట్రింగ్ బాక్సులు ఎత్తుకెళ్తున్న నిందితులను అరెస్ట్ చేసిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పేట్ బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ అంబేడ్కర్‌నగర్‌లో నివసించే కత్తుల గోపాల్ (40), జీహెచ్‌ఎంసీ యూసూఫ్‌గూడ సర్కిల్‌లో చెత్త సేకరించే పనితో పాటు పాత సామాన్ల వ్యాపారం చేస్తున్నాడు. అతడి కుమారుడు సుధీర్ (20) బీటెక్ చదువుతూ.. తండ్రికి సహాయకుడిగా ఉన్నాడు. జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ ప్రాంతానికి చెందిన దుర్గ చైతన్య (19), ఎజెంబర్ (19), చోడి మోన (20), సాయివరుణ్ (19)లు స్నేహితులు. కాగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో పాత సామన్లు, రాత్రి వేళల్లో జీహెచ్‌ఎంసీ స్వచ్ఛ వాహనంలో తిరుగుతూ.. అల్వాల్, పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సెంట్రింగ్ బాక్సులు దొంగతనం చేయడం ప్రారంభించారు. ఎత్తుకెళ్లిన వాటిని గోపాల్, సుధీర్‌లకు అమ్మి జల్సాలు చేసేవారు. కాగా గోపాల్, సుధీర్‌లు ముషీరాబాద్‌లోని పాత సామన్ల వ్యాపారులైన వారికి విక్రయించేవారు. ఈ సెంట్రింగ్ బాక్సులు వరుస దొంగతనాలు నివారించే క్రమంలో అల్వాల్ పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. జీహెచ్‌ఎంసీకి చెందిన స్వచ్ఛ వాహనాన్ని జూబ్లీహిల్స్‌లో గుర్తించారు. 17న ఓల్డ్ అల్వాల్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి జీహెచ్‌ఎంసీ వాహనం, 280 సెంట్రింగ్ బాక్సులు, 4 మొబైల్ ఫోన్లు, రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

విస్తరణ సరే.. తొలగింపెలా ?

రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- రహదారిని విస్తరించినా తీరని ట్రాఫిక్ సమస్యలు
- అధికారుల మధ్య సమన్వయం లోపం
- అరకొర పనులతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



రాధిక చౌరస్తాలో రోడ్డుపైనే విద్యుత్ స్తంభాలు

కుషాయిగూడ: విద్యుత్ స్తంభాలు కూలి రోడ్డుపై వెళ్తున్న వారిపై పడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు నగరంలో పలుచోట్ల జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాల్లో గాయపడి, ప్రాణాలు కోల్పోతున్నా.. అధికారుల తీరులో ఎలాంటి మార్పు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదం జరిగితే కానీ అధికారుల్లో చలనం లేకపోవడం దురదృష్టకరం.

నిమజ్జనంలో దుర్ఘటన..

ఇటీవల వినాయక నిమజ్జన సందర్భంలో నాచారంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై విద్యుత్ పోల్ విరిగిపడి మృతి చెందిన విషయం తెలిసిందే. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రమాదకర విద్యుత్ స్తంభాలపై అధికారుల దృష్టిసారించి మరమ్మతులు చేపడితే కొంత వరకైనా ప్రమాదాలను అరికట్టొచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..

ఈసీఐఎల్ బస్ టెర్మినల్ ఎదురుగా ఉన్న రోడ్డు ఫుట్‌పాత్‌పై, రాధికా చౌరస్తాలో ఫ్రీలెఫ్ట్, ఆర్‌ఎస్ బ్రదర్స్, భవానీనగర్ ఫ్రీ లెఫ్ట్, డీఏఈ కాలనీ, పరివార్ హోటల్ ఎదురుగా, శారదా రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా, శారదా జంక్షన్, ఎన్ఎస్ఐసీ ఎదురుగా విద్యుత్ స్తంభాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఆదమరిస్తే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఈ విషయంపై విద్యుత్‌శాఖ అధికారులకు కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు పలుమార్లు వివరించిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఈసీఐఎల్ టెర్మినల్ నుంచి మల్కాజిగిరి, అల్వాల్, కీసర, కుషాయిగూడ వైపుగా వెళ్లే బస్సులు టెర్మినల్ నుంచి బయటకు వచ్చి ముందు నుంచి యూటర్న్ తీసుకుంటాయి. యూటర్న్ తీసుకునే క్రమంలో బస్సు మలుపు తిరిగే చోటే ఫుట్‌పాత్‌పై విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి.
- రాధికా చౌరస్తాలోని ఫ్రీ లెఫ్ట్ వద్ద కూడా వాహనదారులు అవస్థలు చవిచూడాల్సివస్తోంది. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలతో ఏ సమయంలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇక భవానీనగర్ కమాన్ వద్ద ప్రస్తుతం స్ట్రామ్ వాటర్‌లేన్ కోసం పనులు జరుగుతున్నాయి. పనులు చేసే క్రమంలో విద్యుత్‌పోల్స్‌ను మార్చకుండానే రోడ్డు మధ్యలోనే ఉంచి రోడ్డు విస్తరణ చేస్తున్న తీరు విస్మయానికి గురిచేస్తోంది.



భవానీనగర్ కమాన్ వద్ద..

చౌరస్తాల్లో పెనుప్రమాదమే..

ఆర్టీసీ బస్సు డ్రైవర్లు, వాహనదారులు ఏ మాత్రం అదమరిచిన విద్యుత్ స్తంభాలను ఢీ కొడితే పెను ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. అదే జరిగితే రోజూ వందలమంది వాహనదారులతో రద్దీగా ఉంటే ఈసీఐఎల్, రాధికా చౌరస్తాలో తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయంపై కుషాయిగూడ ట్రాఫిక్ పోలీసులు విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులతో రోడ్డు, జంక్షన్లను విస్తరిస్తున్నారు. ఈ సమయంలో విద్యుత్ స్తంభాలను రోడ్డు మధ్యలోనే ఉంచి రోడ్డు వేసుకుంటూపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. రోడ్డు విస్తరణ చేస్తున్నప్పుడు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను పక్కకు మార్చకుండా అలానే వేయడం వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండా పోతోంది. విద్యుత్ పోల్స్‌ను రోడ్డు మధ్యలో వదిలేయడం వల్ల వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ట్రాఫిక్ సమస్యలు తీరడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

సమన్వయం లేకే జాప్యం..

ప్రభుత్వ శాఖల మధ్య సరైన సమన్వయం లేకపోవడంతో ఇలాంటి సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. అటు విద్యుత్, ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు ఒకరిపై మరొకరు వారి పనులేనని చెప్పడం గమనార్హం. అధికారులు సమన్వయంగా పనిచేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకోవాలి



విద్యుత్ స్తంభాలను రోడ్డుకు దగ్గరగా వేస్తున్నారు. ఫుట్‌పాత్‌లను వదిలి పోల్స్ వేస్తే ఇలాంటి సమస్యలు ఉండవు. ఉదాహరణకు ఏదైన రోడ్డు విస్తరణ చేసేందుకు కోటి రూపాయాలు ఖర్చయితే.. విద్యుత్ స్తంభాల తొలగింపునకు రూ.2 కోట్లు అడుగుతున్నారు. దీనిపై సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకుంటే పరిష్కారం లభించే అవకాశం ఉంది.

– బాలకృష్ణ, ఇంజినీరింగ్ డీఈ కాప్రా సర్కిల్

సమన్వయంగా పనిచేస్తే సమస్యలుండవు



అధికారుల మధ్య సమన్వయం లేకనే ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరిస్తే విద్యుత్ పోల్స్ రోడ్డు మధ్యలోనే వదిలేసి రోడ్డు వేయడమేమిటి.. ? దీనివల్ల ప్రజాధనం వృథా కావడం తప్పా.. ఎలాంటి ప్రయోజనం ఉండదు. అభివృద్ధి పనులు చేసే క్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే ఇలాంటి తప్పిదాలు జరగవు.

– రాజేష్‌గుప్తా, సామాజికవేత్త

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చేతన

రామంతాపూర్: హబ్సిగూడ డివిజన్ రాంరెడ్డినగర్‌లో స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన జలమండలి జనరల్‌మేనేజర్ సంతోష్‌తో కలిసి పర్యటించి భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రాంరెడ్డినగర్‌లో ఎన్నో ఏళ్లుగా భూగర్భ డ్రైనేజీ ఓపెన్ డ్రైనేజీ సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించేందుకు కొత్త పైపులైన్లు వేసి శాశ్వతంగా పరిష్కరించాలని జలమండలి జీఎంను కోరారు. జలమండలి మేనేజర్ రవీందర్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ ఏఈ సాయి, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

యాత్రదానానికి దాతలు ముందుకురావాలి



శ్రీధర్, రాణిగంజ్ డిపో మేనేజర్

గౌతంనగర్: ఆర్టీసీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యాత్రాదానం కార్యక్రమానికి దాతలు విరాళాలు అందించేందుకు ముందుకురావాలని రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్ పేర్కొన్నారు. మల్కాజిగిరి సర్కిల్‌తో పాటు, గౌతంనగర్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో ఎంతోమంది నిరుపేదలు ఉన్నారన్నారు. వారందరికీ దూర ప్రాంతాల్లోని దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలను చూడాలని ఉంటుందని, డబ్బులు లేక వెళ్లలేని పరిస్థితి ఉంటుందన్నారు. అలాంటి వారిని గుర్తించి పంపించే బాధ్యతను తమ సంస్థ నిర్వహిస్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి వారిలో ఆనందాన్ని నింపాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 9959226147.

మహిళల ఆరోగ్య సంరక్షణకు 'స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్'



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ఉమాగౌరీ



ఏఎస్‌రావునగర్ కుషాయిగూడ పీహెచ్‌సీలో..

అల్వాల్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు 'స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్' కార్యక్రమంలో ఎంతగానో దోహదపడుతుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి ఉమాగౌరీ అన్నారు. దేశవ్యాప్తంగా మహిళ ఆరోగ్య రక్షణ కోసం చేపట్టిన స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని బుధవారం అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య శిబిరంలో మహిళలు, చిన్నారులకు వైద్యసేవలు అందించనున్నట్లు వివరించారు. ప్రసూతి, చిన్నపిల్లల, నేత్ర, దంత, చర్మ, ఈఎన్‌టీ, సైకియాట్రిక్ తదితర నిపుణుల వైద్య సేవలు అందించి, అవగాహన కల్పిస్తున్నామన్నారు. మహిళలకు అధిక రక్తపోటు, డయాబెటిక్, టీబీ, హిమోగ్లోబిన్, క్యాన్సర్ వంటి వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. డీసీహెచ్‌ఎస్ సునీత, జీజీహెచ్ సూపరింటెండెంట్ రాధ, అల్వాల్ ఏఎంసీ యాదగిరి, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీదేవి, మహేశ్వరి, సత్యవతి, చంద్రకళ, గీత, కౌశిక్, వసంతకుమారి, అల్వాల్ వైద్యాధికారి శ్రీకాంత్, డాక్టర్లు సుప్రియ, డాక్టర్ శైలజ, అనఘ, స్పెషలిస్ట్ వైద్యులు శ్వేత, సలీం, యశ్వంత్, శిరీష, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కాప్రా: మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా దేశవ్యాప్తంగా స్వస్థ్ నారీశక్తి పరివార్ కార్యక్రమం చేపట్టారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే ఈ కార్యక్రమం బుధవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ జమ్మిగడ్డలోని కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా మొదటిరోజు మహిళలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150 మంది మహిళలకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రమాదేవి వివరించారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం



పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కార్యాలయ సిబ్బంది



కాప్రా మండల కార్యాలయంలో..



నేరేడ్‌మెట్‌లో కాంగ్రెస్ నాయకులు

విశ్వబ్రాహ్మణ అభ్యున్నతికి తోడ్పాటు

కుషాయిగూడ: విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పాటును అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీ, ఫేజ్-1 గ్రౌండ్‌లో విశ్వబ్రాహ్మణ సంఘం కాప్రా సర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ వేడుకల్లో కార్పొరేటర్లు ప్రభుదాస్, పన్నాల దేవేందర్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, మునుగంటి రాంప్రదీప్, లక్ష్మీనారాయణచారి, మల్లికార్జునచారి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



యజ్ఞ మహోత్సవంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

రామంతాపూర్ : శ్రీనివాసపురంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వకర్మ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ చేతన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహా నేటి యువత ఇంజినీర్లు విశ్వకర్మను స్ఫూర్తిగా తీసుకుని నూతన నమూనాలు సృష్టించి దేశాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బోడుప్పల్: అసంపూర్తిగా నిలిచిపోయిన చెంగిచర్ల – చర్లపల్లి రోడ్డును త్వరలో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ కమిషనర్ శైలజ, హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులతో కలిసి బుధవారం ఆయన చెంగిచర్ల రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సగంలోనే రోడ్డు పనులు నిలిచిపోయాయన్నారు. బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మాజీ కో– ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మల్లాపూర్: ఇటీవల నగరంలో జరిగిన అకిడో-2025 కరాటే చాంపియన్‌షిప్ పోటీలో నాచారం డెక్కన్ గ్లోబల్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 18 పతకాలు సాధించారు. 9 మంది పసిడి, 2 రజతం, 7 క్యాంసం పతకాలను సాధించి స్కూల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్నారు. బుధవారం కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులను స్కూల్ చైర్మన్ నవనీతరావు అభినందించారు. ప్రిన్సిపాల్ అక్కినేని స్వర్ణ, కరాటే కోచ్ శివప్రసాద్ తదితరులున్నారు.

సీసీఫుటేజీ ఆధారంగా దర్యాప్తు..

కుషాయిగూడ: చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో లభ్యమైన మహిళ మృతదేహం కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని గుర్తించామని, అతడి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు. 15న మధ్యాహ్నం 11.45 గంటల సమయంలో నిందితుడు ఓ ఆటోలో మహిళ మృతదేహాన్ని ఉంచిన గోనెసంచితో చర్లపల్లి రైల్వేస్టేషన్‌లోకి ప్రవేశించాడు. ఆటోస్టాండ్ వద్ద నిలిపిన ఆటోలోంచి గోనెసంచి దించే దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. మధ్యాహ్నం సుమారు 3 గంటల వరకు రైల్వే స్టేషన్‌లో గడిపిన దుండగుడు అదే సమయంలో వచ్చిన అగర్తలా రైలెక్కి వెళ్లిపోయినట్లు తెలిసింది. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడు వచ్చిన ఆటో డ్రైవరును అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా.. అతడు నానక్‌రాంగూడ నుంచి ఆటోను బుక్ చేసుకుని వచ్చినట్లు తెలిసింది. నిందితుడి ఫోటో ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు మృతురాలు వెస్ట్ బెంగాల్‌కు చెందిన మహిళగా గుర్తించారు. చాలా రోజులుగా వారు నానక్‌రాంగూడ ప్రాంతంలో లేబర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. అగర్తలా ట్రైన్‌లో వెళ్లిన నిందితుడి ఆచూకీపై పోలీసులకు ఇంకా స్పష్టత రాలేదంటున్నారు. కాగా నార్సింగి, నానక్‌రాంగూడ ప్రాంతాల్లోని లేబర్ అడ్డాల్లో పోలీసుల తనిఖీలు చేపట్టారు. అక్కడ లేబర్ సప్లై చేసే పెద్దలతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్నారు. ప్రాథమికంగా లభించిన ఆధారాలతో మృతురాలి ఆచూకీ లభ్యమైనట్లు తెలిసింది. కాగా నిందితుడి ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చిలుకానగర్‌లో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్లు




ఎంపీ ఈటల, ఎమ్మెల్యే, సినీనటుడు సుమన్

ఉప్పల్: హైకోర్టు కాలనీ నుంచి హెచ్‌ఎంటీనగర్ వరకు కాలనీలను కలిపే లింక్ రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్లు బన్నాల గీతాప్రవీణ్, శాంతిసాయిజెన్‌శేఖర్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ. 17 లక్షల వ్యయంతో ఈ లింక్ రోడ్డును త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. లింక్ రోడ్డు ద్వారా ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఉప్పల్ వాసులు నాచారం వెళ్లడానికి దాదాపుగా నాలుగు కిలో మీటర్లు వెళ్తే గానీ చేరుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ రోడ్డు నిర్మాణం వల్ల ఇక్కడి కాలనీవాసులు నాచారం వెళ్లడానికి, అక్కడి వారు ఇక్కడికి రావడానికి కేవలం పది నిమిషాల్లో చేరుకోవచ్చని దీని ద్వారా ట్రాఫిక్ సమస్య కూడా కొంత వరకు తీరుతుందన్నారు. బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, వివిధ కాలనీవాసులు పాల్గొన్నారు.

మల్లాపూర్: నాచారం హెచ్‌ఎంటీనగర్ నుంచి హైకోర్టుకాలనీ వరకు దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ పనులకు రూ.17 లక్షలతో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు శాంతిసాయిజెన్‌శేఖర్, బన్నాల గీతా ప్రవీణ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడు దేశభక్తిని అలవర్చుకోవాలి

నేటి యువతకు జాతీయ గీతం ప్రాధాన్యత ప్రాముఖ్యం భావితరాలకు తెలియజేయాలని ప్రతి పౌరుడు దేశభక్తిని అలవర్చుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నాచారం హెచ్‌ఎంటీనగర్‌లోని హెచ్ఎండీఏ పార్క్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రతిరోజు జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ఎంపీ ఈటల ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమర యోధుల త్యాగ ఫలితమే మనం అనుభవిస్తున్న ఫలాలని కొనియాడారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, సినీనటుడు సుమన్, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్లు శాంతిసాయిజెన్‌శేఖర్, పన్నాల దేవేందర్‌రెడ్డి, బన్నాల ప్రవీణ్‌ముదిరాజ్, మాజీ ఎంబీసీ చైర్మన్ శ్రీనివాస్, హెచ్‌ఎంటీనగర్ ఫ్రెండ్స్ టీం సభ్యులు నందికొండ శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, బెక్కరి రవీందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, జనార్దన్‌రెడ్డి, రామరాజు, అమర్, విజయ్‌కుమార్ మాక్బుల్ తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌రావునగర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన బీజేపీ నేతలు

తెలంగాణ విమోచన దినోత్సవం

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం బీజేపీ నేతలు జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. పలుచోట్ల రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం



సర్దార్ పటేల్ విగ్రహం వద్ద కార్పొరేటర్ శ్రవణ్



విమోచన దినోత్సవ వేడుకల్లో బీజేపీ నేతలు



రక్తదాన శిబిరంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్